

ఇది డంపులో జరిగిన అవినీతి కంపు కథ. వైసీపీ అధికారంలో ఉండగా, అప్పటి ఆ పార్టీ ప్రజాప్రతినిధుల బినామీ సంస్థల అడ్డగోలు బాగోతం. ఆ పార్టీ వారే నిలదీసినా, కడిగేసినా పట్టించుకోకుండా దోపిడీ చేసిన వైనం. లక్షలాది మంది నగర ప్రజలకు సమస్యగా మారిన డంపింగ్ యార్డును కూడా అక్రమ సంపాదనకు వాడుకున్నారు. పాత చెత్తను పూర్తిగా తరలించాల్సింది పోయి.. పాత చెత్తను, కొత్త చెత్తను ఒకే చోట పోసి రూ.కోట్లు కొల్లగొట్టారు. కొందరు ఆడిట్ అధికారులు రైట్ రైట్ అంటూ బిల్లుల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే రూ.9 కోట్ల పేమెంట్ జగినట్లు సమాచారం. మరో రూ.2 కోట్లను సైతం నొక్కేయాలని చూశారు. కానీ కొందరు ఆడిట్ అధికారులు చెక్ పెట్టడంతో ఆగినట్లు సమాచారం.

\- అనంతపురం విద్య



డంపు.. అవినీతి కంపు..!

అనంత డంపింగ్ కథ ఇదీ..

అనంతపురం నగరపాలక సంస్థ అతి పెద్ద సమస్యల్లో డంపింగ్ యార్డ్ ఒకటి. దశాబ్దాల నుంచి గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డు మాత్రమే దిక్కు. 2011 జనాభా లెక్కల ప్రకారం నగరంలో 2.63 లక్షల జనాభా ఉంది. ఇప్పుడు మూడింతలు దాటిందని అంచనా. 2021 నాటికే నగరంలో ప్రతి రోజు 125 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఆ తరువాత కూడా జనాభా పెరిగింది. ఇళ్లు పెరిగాయి. అదే స్థాయిలో చెత్త కూడా పెరిగింది. కానీ డంపింగ్ యార్డ్ మాత్రం అంతే ఉంది. కేవలం 12.65 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీంతో వందల టన్నుల చెత్త పేరుకుపోయి.. డంపింగ్ యార్డు కొండను తలపిస్తోంది. సుమారు 25 ఏళ్ల నుంచి నగరంలోని చెత్తను అక్కడే డంప్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ అక్కడ 3,32,485 మెట్రిక్ టన్నుల చెత్త పోగైనట్లు అధికారులు తేల్చారు. ఈ చెత్తలోనూ అక్రమ సంపాదనకు దిగారు అప్పటి అధికార పార్టీ నాయకులు, కొందరు అధికారులు. బయో మైనింగ్, చెత్త శుభ్రత, తరలింపు పేరిట రూ.కోట్లు కొల్లగొట్టారు.

బయోమైనింగ్ పేరిట భారీ స్కాం.. పాత చెత్తలో కొత్త చెత్త కలిపి.. మాయ

● ఇదీ ఒప్పందం.. అనంతడంపింగ్ యార్డ్‌లో చెత్త నుంచి సందప తయారీ-వ్యర్థ భూమి పునరుద్ధరణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ - లెగసీ వేస్ట్ ల్యాండ్ రిక్లమేషన్) పనులకు వైసీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. యార్డులో ఉన్న 3.32 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ చేసేందుకు 2022లో సిద్ధమయ్యారు. ఒక మెట్రిక్ టన్ను చెత్తను శుద్ధి చేసేందుకు రూ.800 చెల్లించేలా.. రూ.26,59,88,000 పనులకు టెండర్లు పిలిచారు. కానీ ఒక మెట్రిక్ టన్నును రూ.689.54 ఇస్తే చాలు.. శుద్ధి చేస్తామని తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సంస్థ ముందుకొచ్చి.. టెండర్‌ను దక్కించుకుంది. లెస్‌కు కోట్ చేసి రూ.22.92 కోట్లకు 'నోవస్ గ్రీన్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్' సంస్థ టెండరును సొంతం చేసుకుంది. టెండర్ అగ్రిమెంట్ నాటికి (2022 జనవరి) డంపింగ్ యార్డులో 3.32 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉంది. ఆ చెత్తను శుద్ధి చేసి తరలించడానికి ముందు.. కొత్తగా డంపింగ్ యార్డును ఎంపిక చేయాల్సి ఉన్నింది. ఒక వైపు పాత డంపింగ్ యార్డులో చెత్తను బయో మైనింగ్ చేయాలి. మరో వైపు నగరంలోని నిత్యం పుట్టుకొట్టే చెత్తను కొత్తగా ఎంపిక చేసిన డంపింగ్ యార్డులో వేయాలి. అగ్రిమెంట్ మేరకు రోజుకు 1000 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసి తరలించాలి. నిత్యం ఎంత చెత్తను శుద్ధి చేసి తరలిస్తున్నారో డంపింగ్ యార్డులో వేబ్రిడ్జి మీద తూకం వేసి, రసీదులు తీసుకోవాలి. ఏడాది కాలంలో మొత్తం పని పూర్తి చేయాలి.



● ఇవీ.. అక్రమాలు కొత్తగా ఉత్పత్తయ్యే చెత్తను వేసేందుకు కొత్త యార్డును ఎంపిక చేయలేదు. అదే యార్డులో వేస్తూ.. బయో మైనింగ్ మొదలు పెట్టారు. అరకొరగా చెత్తను శుద్ధి చేయడం, కొత్తగా వచ్చే చెత్తను పాత డంపింగ్ యార్డులోనే వేయడం చేస్తూ వచ్చారు. కొత్త చెత్తను, పాత చెత్తను కలగాపులగం చేస్తే.. పాత చెత్త బయో మైనింగ్ ఎంత పరిమాణంలో జరిగిందో ఎవరూ కనిపెట్టలేరని ఎత్తుగడ వేశారు. మసిపూసి మారేడు కాయ చేశారు. 'బయో మైనింగ్ ఎన్ని టన్నులు చేశారు..? ఇంకా ఎందుకు చెత్త అలాగే ఉంది..?' అని ఎవరైనా అడిగితే.. 'అంతా చేశాం. ఇక్కడున్నదంతా కొత్త చెత్తే..' అని చెప్పేలా వ్యూహాత్మకంగా స్కాం చేశారు. రోజువారీ బయో మైనింగ్ లెక్కలను తెలిపే వే బ్రిడ్జి రసీదుల విషయంలోనూ మాయ చేసినట్లు సమాచారం.



● ఆడిట్‌లో గేట్లు ఎత్తేశారు.. డంపింగ్ యార్డులో వెయ్యి మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేయాల్సి ఉంది. ఆ మేరకు తూకాలు వేసిన రసీదులు జారీ కావాలి. కానీ ఒక్కో రోజు రెండు వేల మెట్రిక్ టన్నుల చెత్తను కూడా శుద్ధి చేసినట్లు రికార్డు చేశారని సమాచారం. వేబ్రిడ్జి స్లిప్పుల విషయంలో వైసీపీ పాలకులు, అధికారులు కుమ్మక్కు అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలను గుర్తించి, అడ్డుకట్ట వేయాల్సిన నగరపాలికలోని కొందరు ఆడిట్ పరిశీలకులు.. గేట్లు ఎత్తినట్లు సమాచారం. మొదట సుమారు రూ.1.8 కోట్ల బిల్లులు చేసినట్లు సమాచారం. ఆ తర్వాత మరో రెండు బిల్లులు కలిపి ఏకంగా రూ.6 కోట్లకు పైగా చేసినట్లు తెలిసింది. సహాయ ఆడిట్ పరిశీలకులు ఒకరు, ఆడిట్ పరిశీలకులు ఒకరు సుమారు రూ.9 కోట్ల బిల్లులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వల్లే చెల్లింపులు జరిగాయని తెలుస్తోంది. నిత్యం ఎన్ని టన్నుల వేబిల్స్ స్లిప్పులు తీశారు..? క్షేత్రస్థాయిలో ఎంత బయో మైనింగ్ చేశారు..? ఎంత రికార్డు చేశారు..? డంపింగ్ యార్డులో ఎంత చెత్త ఉంది..? తదితర వివరాలను పరిశీలించకుండానే కమీషన్ల కోసం ఆడిట్ పరిశీలకులు అడ్డగోలుగా బిల్లుల చెల్లింపునకు రెకమెండ్ చేశారని, దీంతో చెల్లింపులు సాఫీగా సాగిపోయాయని అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలో ఆడిట్ పరిశీలకులకు లక్షలాది రూపాయలు చేరినట్లు ఆరోపణలు వస్తున్నాయి.



జడ్పీలోని జిల్లా ఆడిట్ కార్యాలయం

● రూ.2 కోట్ల బిల్లులు రిజెక్ట్..? డంపిగ్ యార్డులో కంపు వ్యవహారం కొత్తగా వచ్చిన ఆడిట్ పరిశీలకుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. బయో మైనింగ్‌లో రూ.కోట్లు కొల్లగొడుతున్న వ్యవహారాలు, బయో మైనింగ్ అక్రమాలు చూసి... వారు అవాక్కయ్యారని తెలిసింది. అందుకే సుమారు రూ.2 కోట్ల బిల్లులను తిరస్కరించారని విశ్వసనీయంగా తెలిసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలు, కొందరు ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల అడ్డగోలు బయో మైనింగ్ వ్యవహారాలు భారీగానే సాగినట్లు సమాచారం. వేబ్రిడ్జి రసీదులకు, టెండర్‌లో ఉన్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో రికార్డు చేసిన వివరాలకు చాలా వ్యత్యాసాలు ఉన్నా.. రూ.9 కోట్ల చెల్లింపులు జరగడం చూసి.. వారు విస్మయం చెందినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పేమెంట్ కోసం వాళ్ల ముందుకు వచ్చిన రూ.2 కోట్ల బిల్లులను రిజెక్ట్ చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలియగానే అప్పట్లో అడ్డగోలుగా రూ.9 కోట్ల చెల్లింపులు చేయించిన ఆడిట్ పరిశీలకుల్లో ఓ మహిళా అధికారి సెలవుపై వెళ్లినట్లు సమాచారం. అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇంజనీర్లు రూ.కోట్లు ఊడ్చేశారని ఆడిట్ అధికార వర్గాలద్వారా తెలిసింది.

రోజువారీ బయోమైనింగ్‌పై కాకి లెక్కలు

అడ్డగోలుగా.. రూ.9 కోట్ల బిల్లుల చెల్లింపు

చెత్త శుద్ధికి రూ.26.59 కోట్లకు టెండర్ ఆహ్వానం

రూ.22.92 కోట్లకే దక్కించుకున్న నోవుస్ గ్రీన్ ఎనర్జీ

వైసీపీ హయాంలో ఆడిట్‌లో భారీ అక్రమాలు..?

తాజాగా పసిగట్టిన కొత్త ఆడిట్ అధికారులు..?

రూ.2 కోట్ల బిల్లుల ఫైల్ తిరస్కరణ

కార్పొరేటర్లు నిలదీసినా..

డంపింగ్ యార్డులో అక్రమాలు జరుగుతున్నాయని వైసీపీకే చెందిన కొందరు కార్పొరేటర్లు గతంలోనే ఆరోపించారు. వైసీపీ హయాంలో ఓ డీఈ వ్యవహార శైలిపై, రూ.6 కోట్లకు పైగా చెల్లింపులపై ఆ పార్టీ కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు గళం విప్పారు. డంపింగ్ యార్డు పనుల్లో అడుగడుగునా అవినీతి తాండవించింది అనేందుకు ఆ పార్టీవారి నిలదీతలే నిదర్శనం. టీడీపీ కూటమి ప్రభుత్వం విచారిస్తే.. రూ.కోట్ల కుంభకోణం వెలుగులోకి రావడం ఖాయం.

బడికి దూరంగా భోజనం..!







భోజనం చేసి తిరిగి వస్తున్న విద్యార్థులు

చేతిలో భోజనం ప్లేట్లు పట్టుకుని వెలుతున్న వీరు బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు. గ్రామంలో ఉన్న పాఠశాలలో గదుల కొరత ఉంది. దీంతో ఉన్నత పాఠశాల భవనాన్ని ఊరికి దూరంగా నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కాకనే.. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులను అక్కడికి తరలించి.. పాఠాలు చెబుతున్నారు. కానీ మధ్యాహ్న భోజనం మాత్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే పెడుతున్నారు. దీంతో రోజూ ఇలా కి.మీ. దూరం తట్టలు ఎత్తుకుని విద్యార్థులు ఊరిలో ఉండే బడి వద్దకు వచ్చి.. భోజనం చేసి వెలుతున్నారు. మరికొందరు అంత దూరం నడవలేక మధ్యాహ్నం పస్తులు ఉంటున్నారు. ఫొటో తీయబోతే.. కొందరు విద్యార్థులు బిడియంతో ముఖానికి ఖాళీ ప్లేట్లను అడ్డుగా పెట్టుకుని పరుగులు తీశారు. సిగ్గు పడాల్సింది ఈ చిన్నారులా..? ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులా..?

\- బొమ్మనహాళ్

కౌలుకు ఇస్తే.. పొలాన్ని ఆక్రమించారు

వైసీపీ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు

విడపనకల్లు, జూలై 8: వైసీపీ నాయకులు కౌలుకు తీసుకున్న తమ పొలాలను తిరిగి ఇవ్వడం లేదని టీడీపీ వర్గీయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన మేరకు, గాజుల మల్లాపురం గ్రామాని చెందిన టీడీపీ నాయకులు పెద్ద ఎర్రిస్వామి, చిన్న ఎర్రిస్వామికి సర్వే నంబరు 683లో 13.13 ఎకరాల భూమి ఉంది. వీరిద్దరూ అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొత్తింటి రాము గౌడ్, ప్రకాష్‌రెడ్డి, రుద్రగౌడ్, మంచాల ప్రకాష్‌రెడ్డికి ఐదేళ్లకు భూమిని కౌలుకు ఇచ్చారు. కౌలు గడువు ముగిసి రెండేళ్లు గడిచినా పొలాన్ని అప్పగించడం లేదు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తామిద్దరం ఆదివారం సేద్యం చేసుకునేందుకు వెళితే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నాగరాజును అడ్డుపెట్టి గొడవకు వచ్చారని, తమపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారని వాపోయారు. తమ పొలాన్ని తమకు ఇప్పించాలని అధికారులను కోరారు.

జీవితాలు ముక్కలు

నియోజకవర్గంలో జోరుగా పేకాట

రూ.20 లక్షలు పోగొట్టుకుని ప్లాట్ రాసిచ్చిన ఓ వ్యక్తి

పేకాట నిర్వాహకులతో పోలీసుల కుమ్మక్కు

విడపనకల్లు, జూలై 8: మండలంలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో పేకాట జోరుగా సాగుతోంది. రూ.కోట్లలో పేకాట టర్నోవర్ జరుగుతోంది. గడచిన రెండు నెలల వ్యవధిలో దాదాపుగా రూ. 10కోట్లకుపైగా పేకాట టర్నోవర్ జరిగినట్లు చర్చలు సాగుతున్నాయి. ఏప్రిల్ నెలలో గడేకల్లు గ్రామంలో దాదాపు రూ. మూడు కోట్లకుపైగా, ఆర్ కొట్టాల గ్రామంలోను రూ. రెండు కోట్లకుపైగా టర్నోవర్ సాగినట్లు సమాచారం. మే, జూన్ నెలల్లో గుమ్మనూరు సరిహద్దులో పేకాట ద్వారా కోట్లు చేతులు మారినట్లు తెలిసింది. విడపనకల్లు ప్రాంతంలో పేకాట ఆడేందుకు కర్ణాటకలోని బళ్లారి, రూపనగుడి, చేళ్లగురికి, కర్నూలు జిల్లా నుంచి ఆలూరు, ఆదోని, జిల్లా నుంచి గుంతకల్లు, తాడిపత్రి, అనంతపురం ప్రాంతాల నుంచి పేకాటరాయుళ్లు వస్తున్నట్లు సమాచారం. వీరు తమ వాహనాలను గ్రామంలోని పలు చోట్ల పార్కింగ్ చేసి ఆట స్థలానికి ద్విచక్రవాహనాల్లో వెళ్తున్నారు. విడపనకల్లు గ్రామంలో ఆదివారం జరిగిన పేకాటపై మండల ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం పేకాటలో దాదాపు రూ.20లక్షలకు పైగా పోగొట్టుకున్నాడు. ఈ డబ్బు అప్పుగా తీసుకోవడంతో దాన్ని తీర్చడానికి బళ్లారి నుంచి వచ్చిన పేకాటరాయుళ్లకు నాలుగు సెంట్ల స్థలాన్ని (ప్లాట్‌ను) అక్కడికక్కడే వారి పేరున రాసి ఇచ్చినట్లు సమాచారం. రెండు రోజుల్లో రిజిస్టర్ చేయించి ఇవ్వాలని వారు కండీషన్ పెట్టి వెళ్లారని ప్రజలు చర్చించుకుంటున్నారు. విడపనకల్లు పోలీసులు పేకాటనిర్వాహకులతో చేతులు కలిపి చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే చర్చ జరుగుతోంది. మండలంలో పేకాటతో పాటు కర్ణాటక సారా వ్యాపారం జోరుగా సాగుతున్నా ఎవ్వరు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్‌ను వివరణ కోరగా తన దృష్టికి ఈ విషయం రాలేదన్నారు. పేకాట జరిగిన విషయమై పూర్తిగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఇంగ అంతా ఫ్రీ

అనంతపురం క్లాక్‌టవర్/అర్బన్, జూలై 8: ఉచిత ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి అమలులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు భూగర్భగనుల శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యువరాజ్ జీఓ నంబరు 70 జారీ చేశారు. 2019, 2021లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఇసుకపాలసీని రద్దు చేస్తూ నూతన పాలసీ విడుదల చేశారు. ఉచిత ఇసుకకు సంబంధించిన పోస్టర్లను భూగర్భగనుల శాఖ ఏజీ రామకృష్ణప్రసాద్‌తో కలిసి కలెక్టర్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

ఉచిత ఇసుక ఉత్తర్వులు జారీ

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఉచిత ఇసుక పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

టన్ను ఇసుక రూ.195

ప్రస్తుతం ఇసుక ధర టన్ను రూ.195గా నిర్ణయించారు. తవ్వకం, రవాణా, సీనరీజ్‌తో కలిపి టన్ను ఇసుకకు రూ.195 చెల్లించాలి. స్టాక్‌పాయింట్ వద్దనే మొత్తాన్ని చెల్లించాలి. వినియోగదారుడు ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, ఎక్కడికి, ఎందుకు ఇసుక తరలిస్తున్నారనే అంశం, వాహన నంబరు పొందుపరచాలి. ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నులు మాత్రమే ఇస్తారు. రెండు వారాలపాటు స్టాక్‌పాయింట్ వద్ద ఆఫ్‌లైన్‌లోనే మ్యానువల్‌గా రసీదులు పొందవచ్చు. జాయింట్ అకౌంట్‌కు డిజిటల్ పేమెంట్స్ మాత్రమే అనుమతిస్తున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉంటుంది.

ఇసుక రీసేల్ నిషేధం

సొంత అవసరాల కంటే ఎక్కువ ఇసుకను నిల్వచేయడం, రీసేల్, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు తరలించడం పూర్తిగా నిషిద్ధం. అలా ఎవరైనా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం, జరిమానా విధించేందుకు జిల్లా స్థాయి ఇసుక కమిటీకి పూర్తి అధికారాలు కల్పించారు.

భారీగా జరిమానాలు

ఇసుక అక్రమంగా తవ్వినా, రవాణా చేపట్టినా జరిమానా భారీగా విధించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ట్రాక్టర్‌కైతే మొదటిసారి రూ.10వేలు, రెండో సారి రూ.20వేలు విధించనున్నారు. లారీకి మొదటిసారి రూ.25వేలు, రెండో సారి రూ.50వేలుగా నిర్ణయించారు. పెద్ద లారీ, భారీ యంత్రాలకు మొదటిసారి రూ.50, రెండో సారి రూ.లక్ష జరిమానా విధించనున్నారు. ఎద్దులబండికి మొదటిసారి రూ.2వేలు, రెండోసారి రూ.3వేలు, తరువాత రూ.5వేలుగా నిర్ణయించారు. ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపుతారు.

రాష్ట్ర ప్రగతికి బాటలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



విలేకరుల సమావేశంలో వెంకటశివుడు యాదవ్

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు వేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీగా ఊరట లభించిందన్నారు. వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్‌రెడ్డి ఇసుక మాఫియా రూ.50వేల కోట్లకుపైగా కొల్లగొట్టారని మండిపడ్డారు. గతంలో పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఖర్చు చేస్తే.. అందులో ఇసుక కోసమే రూ.3 లక్షల దాకా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారన్నారు. గృహ నిర్మాణ శాఖకు ఇసుక సరఫరా పేరుతో జగన్ అండ్ కో 98 లక్షల టన్నుల ఇసుకను లూటీ చేసిందని దుయ్యబట్టారు. వైసీపీనేతలు మింగేసిన ఇసుకతో దాదాపు 10 లక్షలకుపైగా ఇళ్లు కట్టవచ్చునని, దీన్ని బట్టే వైసీపీ నేతలు ఏ స్థాయిలో ఇసుక మాఫియాకు పాల్పడారన్నది ప్రజలు ఆలోచించాలన్నారు.

ప్రజలకు ఊరట

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఉచిత ఇసుక పాలసీ అమలుతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట లభించిందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడంతో అన్నివర్గాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో మాజీ సీఎం జగన్‌రెడ్డి ఇసుక మాఫియా ద్వారా రూ.వేల కోట్లు కొల్లగొట్టారని ఆరోపించారు. జగన్‌రెడ్డి బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన రూ.800 కోట్లు మినహా, ప్రజాధనాన్ని లూటీ చేశారని దుయ్యబట్టారు. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిన ఉచిత ఇసుక పాలసీ అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిరోధిస్తూ, నాణ్యమైన ఇసుకను ప్రజలకు ఉచితంగా ఇస్తామని వెల్లడించారు.



టెంపోలో రైతులు తీసుకువచ్చిన ట్రాన్స్‌ఫార్మర్

ఈ వాహనంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కణేకల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతుది. ఇరవైరోజుల కిందట ఉరుములకు ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. రైతులు క్షేత స్థాయిలోని అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో సదరు రైతు ఓ టెంపోలో ఐదురోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను అనంతపురంలోని మరమ్మతుల కేంద్రానికి తీసుకువచ్చారు. ఇందుకు బాడుగ రూపంలో రైతుకు రూ.2వేలు ఖర్చు అయింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందిచని కారణంగా వరి పంటసాగు కోసం పోసిన పైరు దెబ్బతినింది. దీనివల్ల రైతుకు రూ.8వేలు నష్టం వాటిల్లింది. మరమ్మతుల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మార్చి ఇచ్చినందుకు మరో రూ.5 ఇచ్చుకున్నాడు. సదరు రైతు తన వద్ద ఉన్నది రూ.3వేలే అని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో మరో వ్యక్తితో రూ.2వేలు ఫోన్‌పే చేయించాడు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ మర్మతులకు గురైతే విద్యుత్ శాఖ వాహనాల ద్వారా తరలించాల్సి ఉంది. క్షేత్ర స్థాయిల్లో సంబంధిత అధికారులు స్పందించని కారణంగా రైతులే మరమ్మతుల కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.



ఈ చిత్రం నార్పల మండలం చామలూరు గ్రామంలోనిది. ఫ్యూజులు పోవడంతో రైతే విద్యుత్ సిబ్బందితో ఎల్‌సీ తీసుకుని ఫ్యూజులు తగిలించుకున్నాడు. సాధారణంగా లైన్‌మన్ ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభాలు ఎక్కి ఫ్యూజులు మార్చాల్సి ఉంది. ఈ పని రైతే చేసుకోవడం గమనార్హం. ఈ క్రమంలో జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సంఘనలు క్షేత్రస్థాయిలో కోకొల్లలుగా జరుగుతున్నాయి. సంబంధిత అధికారుల్లో చలనం లేకుండా పోయింది.



ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు..!

- విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు
- మరమ్మతుల్లో అంతులేని అలసత్వం
- రోజుల తరబడి ఎదురుచూపులు
- సకాలంలో స్పందించని క్షేత్రస్థాయి ఉద్యోగులు
- రైతులకు తడిసిమోపెడు ఖర్చు

అనంతపురంరూరల్, జూలై 8: విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు చేసింది. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో విద్యుత్ శాఖ అంతులేని అలసత్వం ప్రదర్శిస్తోంది. రోజుల తరబడి మార్పు కోసం సమయం పడుతుండటంతో విని యోగదారులకు, రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ముఖ్యంగా రైతుల రైతుల పరిస్థితి మరీ దయనీంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ల మార్పుల్లో నెలకొన్న జాప్యం కారణంగా పంటకు సకాలంలో నీరు అందించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. క్షేత్రస్థాయిలోని అధికారులు, ఉద్యోగులు స్పందించకపోవడంతో రైతులే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేట్ వాహనాల్లో తీసుకువచ్చి మార్చుకో వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా రైతులకు రవాణా చార్జీల భారం పడుతోంది. వేలరూపాయలు ఖర్చవుతోంది. ఇందుకు పైఉదాహరణ నిదర్శనం.

ఉమ్మడి జిల్లాలో 1.94 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు..

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్లలో 1.94 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అందులో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,76,693 ఉండగా..సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 17,970 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తంగా 1,94,663 ఉన్నాయి. కాగా గత నెలలో 800పైగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైనట్లు సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు సమస్యలను పెడచెవిన పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. రైతులు, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడల్సిన సంబంధిత అధికారి సమస్యలను తెలుసుకుని సమన్వయం చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తప్పని నిరీక్షణ

పాడై పోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకునేందుకు రైతులకు, విని యోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే పట్టణాల్లో 24గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటల్లో ఆ స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో శాఖ అధికారులు, ఉద్యోగులు ఆ దిశగా పనిచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని స్థానిక అధికారులకు చెబుతున్నా సకాలంలో స్పందిచలేదని రైతులు అంటున్నారు.

23 మరమ్మతు కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలో 23 మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. అందులో విద్యుత్ శాఖకు సంబంధించినది ఒకటి కాగా, మరో తొమ్మిది విద్యుతుశాఖ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఉన్నాయి. ప్రైవేట్‌కు సంబంధించి మరో 10 మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రంలో 3 నుంచి 4 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్కొక్క కేంద్రంలో రెండు రోజులకు మూడునాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు మించి మరమ్మతులు పూర్తి కాలేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు చొరవ చూపలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సొంత డబ్బుతో రవాణా

విద్యుత్‌శాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులే సొంత డబ్బులు పెట్టుకుని మరమ్మతుల కేంద్రాలకు తీసుకువస్తున్నారు. పాడైన వాటిని తరలించేందుకు సంస్థలో ప్రతి సబ్ డివిజన్‌లోను ప్రత్యేకంగా వాహనాలు ఉన్నాయి. ఆ వాహనాల్లో విద్యుత్ సిబ్బంది తీసుకొచ్చి.. వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ పనిని ఆ శాఖ ఉద్యోగులు వదిలేశారు. విధిలేక రైతులు, వినియోగదారులే ఆటోలు, టెంపోలు, ఐచర్ వంటి వాహనాల్లో మరమ్మతు కేంద్రాలకు తీసుకువచ్చి మార్చుకుని వెళుతున్నారు.

సకాలంలో మరమ్మతులు చేస్తున్నాం

గతంలో కంటే ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు తగ్గాయి. సీజన్‌లో మాత్రమే ఎక్కువగా రిపేర్లకు వస్తున్నాయి. ఆ మేరకు పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయిస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– ఈశ్వర్‌రెడ్డి, ఈఈ, ట్రాన్స్‌ఫార్మర్స్

మొక్కలు నాటి సంరక్షించండి

అధికారులకు కలెక్టరు ఆదేశాలు



అనంతపురం టౌన్, జూలై 8: లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ అధికారుల ను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం అన్నిశాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో పది లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యం మేరకు ఈ మొక్కలను తీసుకెళ్లి నాటించడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పోస్టర్లను ముద్రించి ప్రదర్శించాల న్నారు. రాబోయే రోజుల్లో ఏఏ కార్యక్రమాలు ఎపుడు నిర్వహించాలో వాటి జాబితాను తయారుచేసి, ఆ పథకాలు గురించి ప్రచారం చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికపుడు సమీక్షించుకొని వాటి పరిష్కారా నికి కృషి చేయాలన్నారు. రెడ్‌క్రాస్ సంస్థలో ప్రతి ఒక్కరు శాశ్వత సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈనెల 31నాటికి సామూహిక ఉద్యోగ విరమణ పొందేవారితో పాటు ఆగస్టు, సెప్టెంబరు నెలలో ఉద్యోగ విరమణ పొందే వారి పెన్షన్ ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలన్నారు. అన్నిశాఖల పరిధిలోనూ కిందిస్థాయి ఉద్యోగులకు వచ్చేవారం ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్రేడ్ ప్రమోషన్‌లు అందించే కార్యక్రమం చేపట్టాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌తో పాటు వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సమావేశం

అనంతపురం విద్య, జూలై 8: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభంకానుంది. ముఖ్యంగా సర్వసభ్య సమావేశం అజెండాలో ప్రధానంగా 6 అంశాలను ఉంచారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై ప్రభుత్వ శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలకు తెలియజేయడం, జిల్లా అధికారులు సమర్పించిన ప్రగతి నివేదికపై సమీపక్ష, తీర్మానాలు తదితర అంశాలను అజెండాలో పొందుపర్చారు. కొత్త ప్రభుత్వంలో తొలి మీటింగ్ కావడంతో ఉత్కంఠ నెలకొంది.

కొనసాగుతున్న వరద

టీబీ డ్యాంలో 20 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నీటి నిల్వ

బొమ్మనహాళ్, జూలై 8: ఆంధ్ర, కర్ణాటక జీవనాడి తుంగభద్ర జలాశయానికి 20.851 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారం 50,715 క్యూసెక్కులు ఉండగా సోమవారం ఉదయానికి 30,388 క్యూసెక్కులకు తగ్గింది. ఔట్‌ఫ్లో 156 క్యూసెక్కులున్నట్లు అధికారులు వెల్లడించారు. ముందస్తుగానే జలాశయం నుండి ఎగువ కాలువకు నీరు విడుదల అవుతాయన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

బొలెరో బోల్తా.. 16 మందికి గాయాలు



బోల్తాపడిన వాహనం



బాధితులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్



నారాయణమ్మ



శ్రావణి



దస్తగిరమ్మ



లక్ష్మీ



పెద్దక్క



డ్రైవర్‌ను ఆరాతీస్తున్న ఎస్‌ఐ

ప్రమాదంపై ఆరాతీసిన మంత్రి సత్యకుమార్

పరామర్శించిన పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి, జూలై 8: మండలంలోని మాల్యవంతం సమీపంలో సోమవారం బొలెరో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు. తాడిమర్రి మండలం నారసింపల్లెకు చెందిన కూలీలు చీనీకాయలు కోసేందుకు బొలెరోలో నార్పల సమీపం వెళ్లారు. తిరిగి వస్తుండగా.. మాల్యవంతం సమీపంలోని పెట్రోల్ బంకు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి, నారాయణమ్మ, వన్నురమ్మ, నాగేంద్రమ్మ, డ్రైవర్ గోవర్ధన, లక్ష్మినారాయణమ్మ, లక్ష్మి, కుల్లయప్ప, శ్రావణి, జయశ్రీ, నారాయణమ్మ, దస్తగిరమ్మ, పెద్దక్క, పార్వతి, స్వాతి, లక్ష్మిదేవి గాయపడ్డారు. వీరిని 108లో బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ధనలక్ష్మి, నారాయణమ్మ, వన్నురమ్మ, నాగేంద్రమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

మంత్రి సత్యకుమార్ ఆరా

వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ తన కార్యాలయ సిబ్బందిని హరీష్, మల్లి, షరిఫ్‌ను ఆర్డీటీ ఆసుపత్రికి పంపి.. గాయపడ్డ వారి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారిని టీడీపీ నాయకులు ఘంటాపురం జగ్గు, చల్లా శ్రీనివాసులు, తాళ్ళూరి సతీష్, నారాయణస్వామి, అశోక్ పరామర్శించారు.

పరిటాల శ్రీరామ్ ఆర్థికసాయం

తాడిమర్రి: చీనీకాయలు కోసేందుకు వెళ్లివస్తూ బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామం వద్ద బొలోరా బోల్తాపడిన ఘటనలో గాయపడిన తాడిమర్రి మండలం నార్సింపల్లి గ్రామానికి చెందిన వారిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారికి ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎవరూ అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఎల్ నరేంద్రచౌదరి, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊళ్లో చిచ్చుపెట్టొద్దు

తలారి రంగయ్యను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

కుందుర్పి, జూలై 8: ప్రశాంతంగా ఉన్న తమ గ్రామంలోకి వచ్చి రాజకీయ చిచ్చు పెట్టవద్దని మాజీ ఎంపీ తలారి రంగయ్యను టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో కుందుర్పి మండలం మలయనూరులో గత నెల 8న పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. ఆ సమయంలో ఎలాంటి దాడి జరగకపోయినా.. అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త లక్ష్మీకాంత్ ఉద్దేశ పూర్వకంగా దాడి జరిగిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని వారు అన్నారు. లక్ష్మీకాంత్‌ను పరామర్శించేందుకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్య సోమవారం సాయంత్రం గ్రామానికి వచ్చేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. తలారి రంగయ్య గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని తలారి రంగయ్యను వెనక్కి పంపేందుకు ప్రయత్నం చేశారు. ఆయన వెనుదిరిగి వెళ్లకపోవడంతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో పోలీసులు ఆయనను బలవంతంగా వెనక్కు పంపారు. తమను అక్రమంగా అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని వైసీపీ వర్గీయులు ఆరోపించారు.



గ్రామంలోకి వస్తున్న తలారి రంగయ్య, వైసీపీ నాయకులు

మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

అనంతపురం టౌన్, జూలై 8: పనిచేసే ప్రాంతంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ప్రతిచోట ఉండాలన్నారు. శరీరాన్ని తాకడం, శారీరకంగా కలవాలని అభ్యర్థించడం లేదా బలవంతం చేయడం, శృంగారపరమైన చర్యలు, సంభాషణలు, కామెంట్స్, సైగలు చేస్తూ మానసికంగా వేధించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్వంద్వార్థాలుమాట్లాడటం, ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రవర్తించడం కూడా లైంగిక వేధింపులకిందకు వస్తుందన్నారు. ఎక్కడా మహిళలు, ఆడపిల్లలు పట్ల వేధింపులు జరగకుండా చూడటానికి రెండు కమిటీలు ఉండాలన్నారు. కమిటీలను నిబంధనల మేరకు ఎన్నుకోవాలన్నారు. 181, ఎమర్జెన్సీ112, పోలీస్100 సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి 20-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణాకాలంలో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు వివరాలు, పేర్ల నమోదుకు 73 96950345, 7780752418లను సంప్రదించాలని కోరారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, జూలై 8: వినూత్న(నవభారత్ ఫర్టిలైజర్స్) ప్రైవేట్ సంస్థలో సేల్స్ రెప్రజెంటిటివ్స్ ఉద్యోగాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసించిన 18నుంచి 35 సంవత్సరాల్లోపు వయసుగల యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో 10న నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకురావాలని కోరారు. వివరాలకు 08554-245547 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగమేళా

అనంతపురం సెంట్రల్, జూలై 8: ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో 10న నిర్వహించే ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఐసీఐసీఐ బ్యాంక్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. డిగ్రీలో 50శాతం మార్కులు సాధించిన 26 సంవత్సరాల వయసులోపు యువతీ, యువకులు అర్హులన్నారు. వివరాలకు జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేసులు 9704926192 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 985టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, జూలై 8: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డుకార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్‌కు 150టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.17తో పలికినట్లు ఆయన తెలిపారు.

ఎఫ్‌బీఓలకు ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూలై 8: జిల్లా అటవీశాఖ పరిధిలో అర్హత కలిగిన ఇద్దరు ఎఫ్‌బీఓ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్)లకు ఎఫ్ఎస్ఓ(ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డుపల్లి బీట్ ఆఫీసర్‌గా ఉన్న దామోదర్‌కు గాండ్లపెంట ఎఫ్ఎస్ఓగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేశారు. పెనుకొండ రేంజ్‌లోని కొండపల్లి బీట్ ఆఫీసర్‌గా ఉన్న మల్లికార్జునకు ఎఫ్ఎస్ఓగా ఉద్యోగోన్నతి కల్పించి కళ్యాణదుర్గం రేంజ్‌లోని కంబదూరుకు బదిలీ చేశారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోండి

ఏపీయూడబ్ల్యూజే

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 8: జిల్లాలో జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్య పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అక్రెడిటేషన్ పొందిన జర్నలిస్టులు తమ అక్రెడిటేషన్ కార్డు జిరాక్స్‌తో పాటు విద్యార్థి ఆధార్ కార్డు, స్కూల్ పేరు తదితర వివరాలతో ఏపీయూడబ్ల్యూజే నేతలను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15లోగా జర్నలిస్టుల వివరాలు స్థానికంగా ఉన్న యూనియన్ నేతలకు అందజేయాలన్నారు. అనంతపురం నియోజకవర్గంలో జర్నలిస్టులు విశాలాంధ్ర రిపోర్టర్ మల్లికార్జున శర్మ, తాడిపత్రి నియోజకవర్గంలోని జర్నలిస్టులు హెచ్ఎంటీవీ రిపోర్టర్ రంగనాయకులు, గుంతకల్లు నియోజకవర్గంలో జర్నలిస్టులు ఆంధ్రజ్యోతి ఇన్‌చార్జ్ మహమ్మద్ రఫీకి, ఉరవకొండ నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రమేష్, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని జర్నలిస్టులు వెటరన్ జర్నలిస్టు లింగప్రసాద్, రాయదుర్గం నియోజకవర్గంలోని జర్నలిస్టులు వార్త ఇన్‌చార్జ్ కమలాక్షుడు, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల రిపోర్టర్లు అనంతపురం నేతలను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

● ఎంపీ అంబికాకు ఎంపీఈఓల వినతి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 8: వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆ సంఘం నాయకులు కోరారు. సోమవారం నగర శివారులోని ఆయన నివాసంలో సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు శేషు, శివశంకర్, భాస్కర్ నాయక్, గౌరి, శ్యామల ఎంపీకి వినతి పత్రం అందజేశారు. టీడీపీ హయాంలోనే ఎంపీఈఓలుగా తమకు ఉద్యోగ అవకాశం కల్పించారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత కొన్నేళ్లుగా పనిచేస్తున్న తమకు అన్యాయం జరిగిందన్నారు. 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న జిల్లాకు చెందిన ఎంపీఈఓలను తిరిగి అనంతలోనే పోస్టింగ్‌లు ఇప్పించాలని కోరారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ స్పందిస్తూ సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పాస్టర్ల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం రూరల్, జూలై 8: పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా పాస్టర్ల సంఘం నాయకులు ఉమ్మడి జిల్లా ఎంపీలను కోరారు. ఆ మేరకు సోమవారం అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథిలను అసోయేషన్ సభ్యులు జిల్లా కేంద్రంలోని వారి స్వగృహంలో కలిశారు. వారిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. ఇదే సందర్భంలో పాస్టర్లకు సంబంధించిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్ మార్క్, కోశాధికారి జీవన్, ఈసీ మెంబర్లు రూపస్‌కుమార్, జాషువా, జహంగీర్, శాంత వర్ధన్ పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళాలు



టీడీపీ నాయకులకు విరాళాల చెక్కును అందజేస్తున్న పింఛన్‌దారులు

రామగిరి, జూలై 8: మండలంలోని పలు గ్రామాల నుంచి పింఛన్‌దారులు అమరావతి నిర్మాణానికి రూ.7లక్షలకుపైగా విరాళాలు అందించారు. విరాళాలను టీడీపీ మండల నాయకులకు సోమవారం పింఛన్‌దారులు అందిస్తూ ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే పరిటాలసునీత చేతులమీదుగా రాజధాని నిర్మాణానికి అందించాలని కోరారు. రామగిరిలో టీడీపీ నాయకుడు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరంధామ యాదవ్, మారుతీప్రసాద్ తదితరుల చేతికి విరాళాల సొమ్మును అందజేశారు. నసనకోట రూ.62,500, ఆర్.కొత్తపల్లి రూ.51,016, పి.ఆర్. కొట్టాల రూ.60,500, కొత్తగేరి రూ.38వేలు, పేరూరు రూ.51,200, సీ కొత్తపల్లి రూ.14వేలు, రామగిరి రూ.91,800, చెర్లోపల్లి రూ.34,200, రెడ్డివారిపల్లి రూ.20,600, పాపిరెడ్డిపల్లి రూ.42వేలు, గంగంపల్లి రూ.47,100, పెనుబోలు రూ.38వేలు, వెంకటాపురం రూ.35వేలు, కానుగులకుంట రూ.45వేలు, మాదాపురం రూ.45,500 మొత్తం రూ.7,35,416 అందించారు. వీటిని డీడీరూపంలో పంపనున్నట్టు టీడీపీనాయకులు తెలిపారు.

ఉచిత ఇసుకతో కార్మికులకు ప్రయోజనం



మాట్లాడుతున్న ఫక్రుద్దీన్

అనంతపురం న్యూటౌన్, జూలై 8: ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు, పేద ప్రజలకు ఎంతో ప్రయోజనమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉచిత ఇసుక పంపిణీ ద్వారా ఎంతో మంది పేద ప్రజలతో పాటు భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు,

హోంశాఖ మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



హోం మంత్రిని కలిసిన బంగి నాగ

అనంతపురం అర్బన్, జూలై 8: హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం విజయవాడలోని సచివాలయంలో మంత్రి అనితను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ, నాయకులు మునగల రమేష్, హనుమంత రావు, పరూక్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి రక్ష



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఖాదర్‌వలి

రామగిరి, జూలై 8: చిరుధాన్యాలతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని స్వతంత్ర ఆహార శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. సోమవారం మండలంలోని పేరూరుతోపాటు కంబదూరు మండలంకోటగుడ్డం, చెన్నంపల్లి గ్రామాలలో చర, పాస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు, మహిళల ఉపాధిపై వివరించారు. పూర్వ ఆహార అలవాట్లను మానేసి అధునాతన అలవాట్లతో ఆరోగ్యాలు దెబ్బతింటూ వచ్చాయన్నారు. బియ్యం, గోధుమలు, చక్కెర విరివిగా వాడటం వల్ల షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర జబ్బులు వస్తున్నాయన్నారు. వీటికి స్వస్తి పలకాలంటే చిరుధాన్యాలే శరణ్యమని, తక్కువ వర్షాపాతానికి పండే కొర్ర, ఆంధ్రకొర్ర, అరికెలు, బూదలు పండించాలన్నారు. వీటిని ఏవిధంగా పండించాలని రైతులకు వివరించారు. సదస్సులో చర స్వచ్ఛంద సంస్థ ఎస్‌కే స్వామి, పాస్ స్వచ్ఛంద సంస్థ రామప్ప పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

అనంతపురం క్రైం,జూలై 8: అనంతపురం నగరపాలిక కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. గత ఏడాది అక్టోబరులో కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రతి ఆరునెలలకోసారి ఈ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం, ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడుతూ వచ్చింది. ఈ సమావేశం విషయం లోనూ అధికారులు మీడియాకు చెప్పడంలో గోప్యత ప్రదర్శిస్తుండటం గమనార్హం.

నూతన ఒరవడికి కలెక్టర్ శ్రీకారం

● బాధితుల ఫిర్యాదులు నేరుగా అధికారుల వద్దకు..
● ఓపికతో వినతుల స్వీకరణ
● 490 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వినోద్‌కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూలై 8: ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీకోసం నిర్వహణలో కలెక్టర్ వినోద్‌కుమార్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి కలెక్టర్ అర గంట ముందే హాజరై అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులు విన్నవించే సమస్యలను కలెక్టర్ ఓపిగా విన్నారు. అనంతరం అక్కడి నుంచే సంబంధిత శాఖ అధికారితో మైక్‌లో మాట్లాడుతూ బాధితుల సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి వీరి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నిస్తూ బాధితులను ఆ శాఖ అధికారి వద్దకు పంపిస్తున్నారు. గతంలో ఫిర్యాదు వస్తే ఆశాఖ అధికారి వచ్చి ఫిర్యాదు పేపర్ తీసుకొని వెళ్లేవారు. ప్రస్తుతం కలెక్టర్ ప్రతి వినతిపైనా స్పందిస్తూ అధికారులతో బాధితుల ముందే మాట్లాడుతున్నారు. ఒక దశలో అదే సమస్య మళ్లీ మళ్లీ వచ్చినట్లు తెలియగానే ఆ శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాధితులందరూ మీకోసంలో ఇతర అధికారులు ఉన్నా కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించి వినతులు అందజేస్తున్నారు. వారు అందించిన ఫిర్యాదును కలెక్టర్ ఓపికతో స్వీకరిస్తూ బాధితులతో మాట్లాడి పంపిస్తున్నారు. సోమవారం మీకోసంలో 490 వినతులు రాగా వాటిని కలెక్టర్, ఇతర అధికారులు స్వీకరించారు.

● అనంతపురం రూరల్‌మండలం కక్కలపల్లి పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేస్తున్నవారిపై విచారించి చర్యలు తీసుకోవాలని వెంకటస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కక్కలపల్లి కాలనీ కళ్యాణదుర్గం రోడ్డు సర్వే నెం.14-2లో 6-80ఎకరాలలో అక్రమంగా లేఅవుట్ వేసి ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్‌లు అమ్ముతున్నారని, వీటిపై విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు.

● జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని ఆ కళాశాల విద్యార్థులు కలెక్టరును కోరారు.

● నిబంధనలకు విరుద్ధంగా 4వ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు ప్రతిబాభారతి, వీరేంద్ర, నవీన్, వీరు, రాజేంద్ర, చైతన్య, శంకర్ తదితరులు కలెక్టరును కలిసారు.

● వినతులు ఇచ్చేందుకు వచ్చే దివ్యాంగులకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్ కలెక్టర్‌ను కోరారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 50వేలమంది దివ్యాంగులు ఉన్నామని, ప్రధానంగా మహిళలు, గర్భిణులు, వృద్ధులు వస్తే వారు రెవెన్యూభవన్‌లోకి రావడానికి ఎంతో కష్టపడాల్సి వస్తోందన్నారు.

ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్



పవన్‌కుమార్

గార్లదిన్నె, జూలై 8: ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్ ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో ఎన్జీహోం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో తనను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు పవన్‌కుమార్ తెలిపారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ

గార్లదిన్నె, జూలై 8: పాడిరైతులకు ప్రభుత్వంతో సబ్సిడీతో గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు గార్లదిన్నె, యర్రగుంట్ల పశువైద్యాధికారులు రమేష్, ఆంజనేయులు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో అధికశాతం పాడి రైతులు ఉన్నారన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో గడ్డి విత్తనాలు సరఫరా చేస్తుననట్లు తెలిపారు. కేజీ విత్తనాలు రూ.92 అయితే సబ్సిడీ పోను రైతు రూ.23 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతానికి గార్లదిన్నె పశువైద్యశాలలో ఒకట్నిర టన్ను, యర్రగుంట్ల పశువైద్యశాలలో టన్ను గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గడ్డి విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ కార్డు తీసుకుని గార్లదిన్నె పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు. పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకుతుందని, ఇప్పటికే టీకాలు వేశాని, టీకాలు వేయించని రైతులుంటే వెంటనే వేయించాలని సూచించారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

ఆత్మకూరు జూలై 8: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో సోమవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు సుధాకర్ పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. పశువైద్యాధికారి తేజస్విణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

శింగనమల జూలై 8: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు తప్పవని ఎంఈఓ నరసింహరాజు హెచ్చరించారు. సోమవారం మండలంలోని తరిమెల ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓ పరిశీలించారు. పాఠశాల బస్సుల కండిషన్ గురించి ఎంఈఓ ఆరా తీశారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో బోధించాలని, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని, ఫీజులు ఎక్కువగా వసూలూ చేస్తే చర్యలు తప్పవన్నారు.

ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకుడు అక్బర్

గార్లదిన్నె, జూలై 8: నకిలీ మందులు విక్రయించే ఎరువుల దుకాణాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో తహసీల్దార్‌ను రైతులు కలిశారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 40 వరకు ఎరువుల దుకాణాలు ఉన్నాయన్నారు. వీటిలో కొన్ని దుకాణాల్లో నకిలీ మందులు విక్రయిస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ లోకేశ్వరీకి అందచేశారు. మండల కార్యదర్శి జనార్ధన్, సభ్యులు లక్ష్మీదేవి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

నార్పల, జూలై 8: అనంతపురంలోని కలెక్టరేట్ వద్ద జరిగే 10వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల నాయకుడు బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. ధర్నా కరపత్రాలను సోమవారం ఆ యూనియన్ నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి స్వీపర్లు, ఎలక్ట్రిషియన్, వాటర్‌మ్యాన్, అటెండర్‌గా గ్రామ పంచాయతీలో తక్కువ వేతనాలతో పని చేస్తున్నామన్నారు. పంచాయతీ ఇస్తున్న వేతనాలు సరిపోవడం లేదన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. వివిధ డిమాండ్లతో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు కడపల నారాయణస్వామి, కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రాజారెడ్డి, గాజుల లక్ష్మీనారాయణ, రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

గూగూడు బ్రహ్మోత్సవాలు సజావుగా నిర్వహించండి

శింగనమల జూలై 8: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులందరి సమన్వయంతో సజావుగా నిర్వహించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అధికారులకు సూచించారు. సోమవారం గూగూడు బ్రహ్మోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గూగూడుకు 10 రోజుల పాటు నిత్యం భక్తులు వేలాది సంఖ్యలో తరలివస్తారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారులన్నీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, భక్తులకు ఆరోగ్య సమస్య రాకుండా వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకూండా పోలీసులు భద్రత కల్పించాలన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాలన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం, జూలై 8: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు వివేకానంద అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 పదోవతరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనసభ నిర్వహించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి దీక్షతకు రూ.5,000, కారుణ్యసాయి రూ.3వేలు, రుచితకు రూ.2వేలు నగదు బహుమతిని వివేకానంద, పాడరాళ్ల రవీంద్రా, పీ రంగనాథ్ అందజేశారు. ప్రధానోపాధ్యాయరాలు వసుంధర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌ను బలపరచండి



ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు

రామగిరి, జూలై 8: యూటీఎఫ్‌ను బలపరచాలని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సత్యసాయిజిల్లా ఆ సంఘం అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. సోమవారం ఆయన మండలంలోని పలు పాఠశాలలకు తిరుగుతూ ఈ ఏడాది సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని కోరారు. కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహతో కొనసాగుతున్న యూటీఎఫ్ స్థాపించి 50సంవత్సరాలు పూర్తయిందన్నారు. స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సంఘాన్ని ఉపాధ్యాయులందరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో రామగిరి మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు శివయ్య, వినయ్‌కుమార్, చంద్రశేఖర్, సురేశ్, మల్లేశ్, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

మొక్కల పెంపకం.. సామాజిక బాధ్యత



మొక్కలతో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

అనంతపురంరూరల్, జూలై 8: మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ నల్లపాటి సునీత అన్నారు. సోమవారం కురుగుంటలోని కళాశాల ఆవరణంలో అనంత వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పూల కుండీలను తెచ్చి పూల మొక్కలు నాటారు. విద్యార్థులతో కళాశాల ఆవరణంలో మొక్కలు నాటించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను పునఃనిర్మించుకోవాలన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: కాంగ్రెస్



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూలై 8: పేదల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా చేపట్టిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకులు కొనియాడారు. సోమవారం వైఎస్ఆర్ 75వ జయంతిని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాయకులు ర్యాలీగా వెళ్లి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నాయకులు జాన్‌వెస్లీ, ఓబిరెడ్డి, కొండారెడ్డి, ఆంజనేయులు, శర్మాస్ వలి, పరమేష్‌రెడ్డి, ఓబులేసు, శ్రీకాంత్, మురళీ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..: వైఎస్సార్ ప్రవేశపెట్టి అమలు చేసిన విద్యాసంస్కరణలను పునరుద్ధరించాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం దివంగత నేత వైఎస్ఆర్ 75వ జయంతిని ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేని ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. ఉన్నత విద్యకు శరఘాతంగా ఉన్న జీఓ నెంబర్ 77 ను రద్దు చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, ఉపాధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి అనిల్, ప్రదీప్, రాము, రాజేష్, గిరీష్, జోసఫ్ పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద విద్యార్థినులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఉచిత ఇసుక విధానం హామీని నెరవేర్చిన సీఎం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, జూలై 8: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఉచిత ఇసుక విధానం హామీని నెరవేర్చారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం నగరంలోని తన నివాసంలో పరిటాల సునీత మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ఇసుక మాఫియా రాజ్యమేలిందన్నారు. జగన్ అండ్ కో వేలాది కోట్లు కొల్లగొట్టారని మండిపడ్డారు. చంద్రబాబు నెల రోజుల్లోనే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంపై నియోజకవర్గం ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పేదల సొంతింటి కల నేరవేరే అవకాశం ఉందన్నారు. నిర్మాణ రంగం ఊపందుకుంటుందన్నారు. ఉచిత ఇసుక విధానంతో సామాన్య ప్రజలకు భారీ ఊరట లభించిందన్నారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు ఇసుకను ఆదాయవనరుగా మార్చుకొని దోపిడీ చేశారన్నారు. ఈ విధానానికి చంద్రబాబు స్వప్తి పలికారన్నారు.

ఇల్లు కట్టాలంటే.. ఇసుక భయం అక్కర్లేదు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 8: ఇల్లు కట్టాలంటే ఇక నుంచి ఇసుక భయం అక్కర్లేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఇళ్లు కట్టుకోవాలంటే ధరలు చూసి భయపడేవారన్నారు. ఇసుక కుంభకోణం ద్వారా వేలాది కోట్లను గత ప్రభుత్వం కొల్లగొట్టిందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడం హర్షణీయమన్నారు. ఇసుకను అక్రమంగా ఇవరైనా తరలిస్తే సీఎం సారథ్యంలోని ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఉచిత ఇసుక విధానం అమలుతో భవన నిర్మాణ రంగానికి పూర్వవైభవం వస్తుందన్నారు.

ఉచిత ఇసుక పాలసీ.. రాష్ట్ర ప్రగతికి బాట..

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల జూలై 8: ఉచిత ఇసుక పాలసీతో పేదల సొంతింటి కల నెరవేరతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఉచిత ఇసుక పాలసీపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ జగన్ ఇసుక మాఫియాతో కోట్లు కొల్లగొట్టాడని, ఐదేళ్లలో పేదలకు చేరువలో ఇసుక లేదన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తూ జీవో 43 విడుదల చేసి నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచారన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు జూలై 8: ఉచిత ఇసుక విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకురావడంపై టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో వైసీపీ నాయకులు ఇసుకను ఆదాయ వనరుగా చేసుకుని దోపిడీ చేశారన్నారు. వెంకటనారాయణ, పూల ఓబుళపతి, బొమ్మయ్యబాబా, సుధాకర్, రమేష్, లక్ష్మీదేవమ్మ, హరి, బోయ హరి, వసూరన్న, జగదీష్, మల్లన్న, మురళి పాల్గొన్నారు.

'ప్రజా ప్రభుత్వంలోనూ ఉద్యోగులపై వివక్షేనా?'



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం సెంట్రల్, జూలై 8: కూటమి అధికారం చేపట్టినా దళిత, గిరిజన సామాజిక ఉద్యోగులపై వివక్ష తప్పదా అని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ప్రశ్నించారు. ఉద్యోగులపై వివక్ష చూపుతూ వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఎస్పీ గౌతమి శాలికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అనేక మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను వేధించారని వాపోయారు. రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన ఉద్యోగోన్నతలు, బదిలీలు, వేతనాల పెంపు తదితర ప్రయోజనాలు అందకుండా చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రామకృష్ణ, సుంకన్న, వన్నూరప్ప, కుమార్, ఓబులేసు, తిరుపతయ్య పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



తాతిరెడ్డి (ఫైల్)

గార్లదిన్నె, జూలై 8: మండలంలోని కోటంక గ్రామానికి చెందిన తాతిరెడ్డి అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కుమారుడు తాతిరెడ్డి ఐటీఐ చేసి తండ్రికి తోడుగా వ్యవసాయ పనులు చేసేవాడు. 2020లో జరిగిన ప్రమాదంలో తాతిరెడ్డి మతిస్థిమితం కోల్పోయాడు. వారం రోజుల క్రితం నాలుగు లక్షలు అప్పులున్నాయి ఇవ్వాలని తండ్రి నారాయణరెడ్డిని అడిగాడు. అప్పులు ఇచ్చిన వారిని పిలిపిస్తే అప్పులు కడతామని తండ్రి చెప్పాడు. తాతిరెడ్డి 6వ తేదీ నుంచి కనిపించకుండా అదృశ్యమయ్యాడు. దీంతో తాతిరెడ్డి కోసం కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం రాత్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నగరంలో హిజ్రాల గొడవ

● ఇరువర్గాలపై కేసు నమోదు

అనంతపురం క్రైం,జూలై 8: నగరంలో హిజ్రాల గొడవలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. చివరకు పోలీసులను సైతం కేర్‌చేసే పరిస్థితి లేదు. హిజ్రాల్లోనే ఆసిఫ్, నెల్లూరుకు చెందిన హాసిని వర్గాల మధ్య తరచూ అంతర్గత పోరు సాగుతోంది. రెండు రోజుల క్రితం జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని ధర్మవరం వెళ్లి తిరిగి గుత్తికి వెళ్తున్న హాసిని వర్గానికి చెందిన హిజ్రాలను ఆసిఫ్ వర్గం అడ్డుకుంది. ఈ క్రమంలో తపోవనం సర్కిల్‌లో రెండు వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. దీంతో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఫోర్త్‌టౌన్ సీఐ ప్రతాప్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హిజ్రాలు పోలీసులపైనా శివాలెత్తారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మీరు ఏం చేస్తారంటూ ప్రశ్నించారు. వీడియోలు తీస్తున్న మీడియా సిబ్బందిపైనా ఇంతెత్తున లేచారు. ఈ ఘటనపై రెండు వర్గాలపైనా (ఒక్కో గ్రూపు నుంచి ఆరగురు)పై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తపోవనం సర్కిల్‌లో జరిగిన ఘటన స్థానికుల్లో ఆందోళన కలిగించింది. రెండు రోజుల క్రితం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో కత్తితో దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. గతంలో అనంతపురం నగరంలోని వేణుగోపాల్ నగర్‌లో రెండు వర్గాలు కొట్టుకున్నాయి.

పెద్దమ్మ ఆలయ హుండీ లెక్కింపు

తాడిపత్రి, జూలై 8: పట్టణంలోని పొలిమేర పెద్దమ్మ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. సంవత్సరానికి సంబంధించి హుండీ ద్వారా రూ.2,98,870 ఆదాయం వచ్చింది. మాజీ కౌన్సిలర్ మురుగన్ బాలు, దబ్బర బాబు, ప్రసాద్, బాల యల్లయ్య, నాగసుబ్రహ్మణ్యం, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్ అఫీషియో సభ్యత్వానికి ఎమ్మెల్యే దరఖాస్తు

గుంతకల్లు, జూలై 8: స్థానిక పురపాలక సంఘంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తన పేరు నమోదు చేసుకునేందుకు సమ్మతిని తెలుపుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మున్సిపల్ కమిషనరుకు దరఖాస్తు పంపారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి సోమవారం మధ్యాహ్నం కమిషనర్ వెంకటరమణయ్యను కలసి ఎమ్మెల్యే తరఫున విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో గుంతకల్లుతో పాటు గుత్తి మునిసిపాలిటీ ఉన్న కారణంగా ఏదో ఒక పురపాలక సంఘంలో ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఎమ్మెల్యే జయరాం గుంతకల్లు మునిసిపాలిటీలో తన పేరును నమోదు చేయడానికి సమ్మతి పత్రాన్ని పంపారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పామిడి, జూలై 8: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు గత రిపోర్టులు, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మొహరం వేడుకలకు అనుమతులు తప్పనిసరి

పుట్లూరు, జూలై 8: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో మొహరం వేడుకలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ హేమాద్రి సోమవారం తెలిపారు. ముందుగా ఆయా గ్రామాల పెద్దలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, సీఐ, డీఎస్పీ అనుమతులు తీసుకున్న వెంటనే వేడుకలను ప్రారంభించాలని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి, జూలై 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండో విడతలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలు కోర్సుల్లో నిరుద్యోగులకు ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు సంబంధించి మూడునెలలు శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ ఆపైన చదివిన వారు అర్హులన్నారు. ట్యాలీకి సంబంధించి రెండు నెలలు శిక్షణ ఉంటుందని, ఇంటర్ ఆపైన చదివిన వారు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తిగల యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9133004626 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల పంపిణీ

ఉరవకొండ, జూలై 8: పట్టణంలోని గ్రామ సచివాలయం-5కు టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావులకేశవ్ చిత్రపటాలను సచివాలయ సిబ్బందికి అందజేశారు. వాటిని కార్యలయంలో ఏర్పాటు చేయాలని కోరారు. టీడీపీ నాయకులు ప్రభాకర్, బుడేన్, మరుట్ల ప్రభాకర్, గోపాల్, బేల్దారి బాషా, నాగభూషణ్, శ్రీన, శర్మాష్, శంకర్ పాల్గొన్నారు.

పశువులకు ముద్దచర్మవ్యాధి టీకా

బ్రహ్మసముద్రం, జూన్ 8 : మండల పరిధిలోని పోలేపల్లి, వేపులపర్తి, బొమ్మగానపల్లి, ముప్పులకుంట గ్రామాల్లో పశువులకు సోమవారం ఉచితంగా ఎల్ఎస్‌డీ (ముద్ద చర్మవ్యాధి) టీకా వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలో పశువైద్య సిబ్బంది మూడు టీమ్‌లుగా ఏర్పడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పశు వులకు టీకావేస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం

గుమ్మఘట్ట, జూలై 8: మండలంలోని గొల్లపల్లి, 75 వీరాపురం, భూపసముద్రం గ్రామాల్లో సోమవారం పశు వైద్యాధికారి నవీన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు చర్మవ్యాధులు, గర్భకోశ వ్యాధులకు సంబంధించి టీకాలు వేసినట్లు వారు తెలిపారు. వారంరోజుల పాటు ప్రతి గ్రామంలో పశువులకు పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంపౌండర్ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూలై 8: పట్టణంలోని మస్తాన్‌పేటకు చెందిన రవిశంకర్ (21) సోమవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డినట్లు పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు. రవిశంకర్ పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి సుదర్శన్‌కు పక్షవాతం వచ్చింది. పనికి వెళ్లకుండా ఖాళీగా ఇంట్లో కూర్చుంటే కుటుంబం ఎలాగడుస్తుందని తల్లి అనిత మందిలించడంతో మనస్థాపం చెందిన రవిశంకర్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

ఘర్షణలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్, జూలై 8: మండలంలోని బాచుపల్లిలో సోమవారం జరిగిన ఘర్షణలో లక్ష్మయ్య అనే యువకుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రామాంజనేయులు, సురేష్, లక్ష్మయ్య, కురబయ్య, సుంకప్ప అనే ఐదుగురు లక్ష్మయ్యపై దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడు లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారి మధ్య కొంత కాలంగా గొడవలు ఉండేవని కుటుంబ సభ్యులు తెలిపారు. అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

యువతి ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప, జూన్ 8: మండలంలోని జీడిపల్లి సమీపంలో మహారాష్ట్రకు చెందిన బనేవాడి గ్రామవాసి సునిల్ కుమార్తె దేవిశ్రీ అనే యువతి సోమవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ కుటుంబం కొన్ని నెలలుగా మండలంలోని పలు గ్రామాల్లో బొగ్గులు కాల్చుతూ జీవనం సాగిస్తోంది. కుటుంబ సమస్యలతో ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలిసింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే కాలవ



ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను నింపుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంరూరల్, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని జుంజురంపల్లి సమీపంలోని వేదావతిహగరి నది వద్ద ఇసుకరీచ్‌లో సోమవారం ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఐదు హామీలను నెరవేర్చేందుకు తొలిసంతకం పెట్టారన్నారు. పింఛన్ రూ. 4వేలు పెంచి అందిస్తున్నారన్నారు. ఉచితంగా ఇసుకను పొందేందుకు జుంజురంపల్లి ఇసుకరీచ్‌లో వెసులుబాటు కల్పించామన్నారు. గతంలో ఈ ఇసుకరీచ్ వైసీపీ నాయకుల ఇసుకదోపిడీకి నిలయంగా ఉండేదన్నారు. ప్రభుత్వం ఇసుక పంపిణీని అత్యంత పారదర్శకంగా కేవలం లోడింగ్ చార్జీ రూ. 195 తీసుకుని టన్ను ఇసుకను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు ఈ ఇసుకను వాడు కోవచ్చన్నారు. టన్ను ఇసుక కూడా దుర్వినియోగం కాకుండా అధికారులు చూడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇసుక పంపిణీకి అధికారులు సిద్ధం అవుతున్నారన్నారు. కార్యక్రమంలో మైన్స్ అండ్ జియాలజీ డీడీఏ నాగయ్య, డీటీ రఘు, వీఆర్వో భీమప్ప, పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్పంచులు వన్నూరుస్వామి, అశోక్, రాజశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ హనుమంతు, టీడీపీ నాయకులు పోట్ల రవి, టంకశాల హనుమంతు, కాటా వెంకటేశులు, లచ్చన్న, వీరయ్యస్వామి, గోవిందరాజులు, సోమశేఖర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎమ్మెల్యే జేసీ పర్యటన



పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జూలై 8: పట్టణంలోని అశోక్‌పిల్లర్, అభయాంజనేయస్వామి ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా దుకాణాల వద్దకు వెళ్లి యజమానులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిరువ్యాపారులను సైతం పలుకరించారు. వ్యాపారాలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఖాదర్ బాషా, కిరణ్‌కుమార్, కొండా శివ, హేమంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'రైల్వే మోరీ కింద మట్టిని తొలగించాలి'

గుంతకల్లుటౌన్, జూలై 8: పట్టణంలోని గుంతబావి సమీపంలోని రైల్వే మోరీ కింద పేరుకు పోయిన మట్టిని తొలగించాలని టీడీపీ మాజీ కౌన్సిలర్ అంజి సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరరణయ్యకు వినతిపత్రం అందజేశారు. ధర్మవరం గేట్ వేసినపుడు వాహనదారులు, పాదాచారులు రైల్వే మోరీ కింద నుంచి వెళ్తారన్నారు. నిరంతరం అక్కడ మురుగు నీరు ప్రవహించి మట్టి పేరుకుపోతోందన్నారు. దీంతో వాహనదారులు కొంత మంది కిందపడి గాయపడుతున్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ధర్మగేట్ ప్రాంత వాసులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి: సీపీఐ

గుంతకల్లుటౌన్, జూలై 8: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరిని కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాము మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారన్నారు. అలాగే మొహరం సందర్భంగా గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు దేవేంద్ర, ఉమర్ బాష, గురుస్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

బొమ్మనహాళ్, జూలై 8: అతిసార బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యసిబ్బంది విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో హెల్త్ అసిస్టెంట్లు జైనాబీ, గోవర్ధన్ సోమవారం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్ర త పాటించాలన్నారు. వాంతులు, విరేచనాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

విషజ్వరాలపై విద్యార్థులకు అవగాహన

తాడిపత్రి, జూలై 8: డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని విజయనగర్‌కాలనీలో ఉన్న బాయ్స్‌హైస్కూల్‌లో సోమవారం విషజ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికి సయ్యద్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీ సర్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

గుంతకల్లు టౌన్, జూలై 8: పట్టణంలోని మస్తాన్‌పేట సమీపంలో రైల్వే అధికారులు నిర్మించిన ప్రహరీని తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవా రం రైల్వే డీఆర్ఎం కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పట్టణ పౌరుల సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మారుతిప్రసాద్, సాకే నాగరాజు, రమేష్ మాట్లాడుతూ మస్తాన్‌పేట, బెంచికొట్టాల, పోర్టర్‌లైన్ పరిసర ప్రాంతాలలో ఉన్న దారులను తెరపించా లని కోరుతూ ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

ఓరియంటల్ ఎస్ఎస్‌సీ పరీక్షలకు అనుమతి లేదు

తాడిపత్రి, జూలై 8: ఓరియంటల్ సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ పరీక్షలకు అనుమతి లేదని ఎంఈఓ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఈ పరీక్షలకు సంబంధించి కొందరు చేస్తున్న ప్రచారాన్ని తల్లిదండ్రులు ఎవరూ నమ్మవద్దన్నారు. ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటుకావన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఫీజులు చెల్లించ వద్దన్నారు.

రోటరీక్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారం



రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటున్న పీవీ సుబ్రహ్మణ్యం

తాడిపత్రి, జూలై 8: రోటరీ క్లబ్ స్థానిక కార్యాలయంలో సోమవారం 2024-25 సంవత్సరానికి సంబంధించి రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల నూతన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. రోటరీక్లబ్ అధ్యక్షుడిగా పీవీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎస్ఎండీ రఫీ, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా కౌసర్‌బేగం, కార్యదర్శిగా రేణుకాదేవి, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌ను మహిళకు అందజేశారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ఆవులతిప్పాయపల్లి సమీపంలో ఉన్న జీవనాలయంలో మహిళల కోసం వ్యాయా మ ఉపకరణాన్ని అందించినట్లు అధ్యక్షురాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా భావించాలి

ఎమ్మెల్యే కాలవ



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, జూలై 8: ప్రతి ఒక్కరు మొక్కల సంరక్షణ బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని 75 వీరాపురం నుంచి కేపీ దొడ్డి వరకు మూడు కిలోమీటర్ల చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన సోమవారం హాజరై ప్రారంభించారు. సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో 1200 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుటుంబంలో ప్రతి వ్యక్తి ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ తీసుకోవాలని కోరారు. ఇలా చేస్తే రాష్ట్రం హరితాంధ్రప్రదేశ్‌గా మారుతుందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, నాయకులు కాలవ సన్నన్న, సర్పంచ్ నాగరాజు, ఏపీఓ సురేష్, ఎంపీపీ భవాని, పంచాయతీ విస్తరణాధికారి సురేష్, ఈసీ అంజన్‌కుమార్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం ప్రజల రుణం తీర్చుకుంటా

రాయదుర్గం: అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించిన రాయదుర్గం పట్టణ ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుని వారి రుణం తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని 6, 9 వార్డుల టీడీపీ ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల పురుషోత్తం, పొరాళ్ల గౌరి ఆధ్వర్యంలో సెయింట్ పాల్స్ స్కూల్ వద్ద ఆయనను ఘనంగా సత్కరించారు.

విరివిగా మొక్కలు నాటాలి

కుందుర్పి: విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుదామంటూ ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతి కార్యాలయం వద్ద ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలని వారు కోరారు.

గుత్తిరూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ సూచించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయ ఆవరణంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన పాల్గొని మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు ఏంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, చికెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



గుంతకల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్, జూలై 8: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సోమ వారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని కృష్ణా, అన్నదాత, సుదర్శన్ ఫర్టి లైజర్ దుకాణంలో అధికారుల ప్రత్యేక బృందం తనిఖీలు చేశారు. బిల్ బుక్‌లలో రైతుల సంతకాలు లేనందున రూ.41,5,309లు విలువ గల పురుగుల మందులు నిలుపుదల చేస్తూ ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం, తిరుపతి జిల్లాల ఏడీఏ భాస్కరయ్య, టెక్నికల్ ఏడీలు వెంకట కుమార్, బాలునాయక్, ఏఓ స్వాతి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

గుత్తి: రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీ ల్లో భాగంగా ఏడీఏడీఆర్సీ భాస్కరయ్య ఆధ్వర్యంలో అనంతపురం, తిరుపతి జిల్లాలకు చెందిన విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ స్థానిక అధికారుల బృందం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో సరైన డాక్యుమెంట్లు లేకపోవడంతో దుకాణంలోని రూ.63,24,04 విలువ చేసే పురుగుల మందుల విక్రయాన్ని నిలిపివేశారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటకుమార్, బాలునాయక్, ఏఓ ముస్తాక్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను సోమవారం ఏడీఏడీఆర్సీ భాస్కరయ్య తనిఖీ చేశారు. ఆదిత్య ట్రేడర్స్‌లో స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డును సరిగా నిర్వహించకపోవడంతో విక్రయాలను నిలిపివేసినట్లు తెలిపారు. శ్రీ హనుమాన్ ట్రేడర్స్ దుకాణాన్ని తనిఖీ చేయడానికి వెళ్లగా దుకాణం మూసివేసి ఉండడం గమనార్హం. దీంతో షాపు లైసెన్సును అప్పగించాలని ఆయన ఆదేశించారు. గుత్తి ఏడీఏ వెంకటరాముడు, అనంతపురం అధికారులు బాలునాయక్, వెంకట్‌కుమార్, మండల ఏఓ మల్లేశ్వరి, ఏఈఓ రజనీ ఉన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని భవాని ఫర్టిలైజర్స్‌ను విజిలెన్స్ అధికారుల బృందం సోమవారం సాయంత్రం తనిఖీ చేసింది. దుకాణంలోని అధికారులు ఎరువులను, రికార్డులను పరిశీలించారు. నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ భాస్కరయ్య, విజిలెన్స్ అధికారి విజయ్‌కుమార్, టీఏలు వెంకటేష్, బాలునాయక్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల మూసివేత

కళ్యాణదుర్గం, జూన్ 8 : తిరుపతి జిల్లా నుంచి వ్యవసాయ శాఖ ఏడీ భాస్కరరావు ఆధ్వర్యంలో మూడు రోజుల కిందట కళ్యాణదుర్గం పట్టణంలో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. మళ్లీ సోమవారం కూడా విజిలెన్స్, వ్యవసాయాధికారులు తనిఖీలకు వస్తున్నారనే సమాచారం తెలియడంతో పట్టణంలోని సుమారు 20 ఎరువుల దుకాణాలు మూసివేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అన్ని దుకాణాలు తాళాలతో కనిపించాయి. అదేవిధంగా కంబదూరు మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలన్నీ మూసివేశారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

ఉరవకొండ, జూలై 8: మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో ప్రమాదవశాత్తు భాస్కర్(26) అనే యువరైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామసమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. అతవిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెంది నట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారి పనులు చేపట్టాలి

గడేకల్లు గ్రామస్థుల డిమాండ్.. రాస్తారోకో



గ్రామస్థులతో చర్చిస్తున్న పోలీసులు

విడపనకల్లు, జూలై 8: మండలంలోని గడేకల్లు గ్రామంలో జాతీయ రహదారి పనులు చేపట్టాలంటూ గ్రామస్థులు సోమవారం ఉదయం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆరేళ్ల క్రితం గుంతకల్లు-బళ్లారికి వెళ్లే 67వ జాతీయ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చాన్నారు. ఇందులో భాగంగా అప్పట్లో గడేకల్లు గ్రామం వద్ద అటు వైపు ఊరి చివర నుంచి స్థానిక బస్టాండ్ వరకు ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారని అన్నారు. మళ్లీ పనులు ప్రారంభించలేదన్నారు. దాదాపుగా కిలోమీటరు పొడవున తవ్వటంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాల దాటికి దుమ్ము దూళితో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. జాతీ రహదారి పనులు చేపట్టాలని ఎన్నిసార్లు ధర్నాలు, రాస్తా రోకోలు చేసినా అధికారుల్లో చలనం రాలేదన్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న విడపనకల్లు పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్థుల తో చర్చించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైందని, జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు త్వరగా చేపట్టేందుకు కృషి చేస్తామని పోలీసులు తెలుపడంతో గ్రామస్థులు రాస్తారోకో విరమించారు.

ఉచిత ఇసుక విధానంపై హర్షం



ఉరవకొండ, జూలై 8: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలుపై టీడీపీ శ్రేణులు, భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని టీడీపీ కార్యాలయం నుంచి కవితా హోటల్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి కేశవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రామాంజనేయులు, తిమ్మప్ప, నాగేశ్వరరావు. ప్యారం కేశవానంద, గోవిందు పాల్గొన్నారు.



బెళుగుప్ప: గత వైసీపీ ప్రభుత్వ ఇసుక విధానంతో ఎంతోమంది భవన కార్మికులు ఉపాధి పట్టణాలకు వలసవెళ్లారని టీడీపీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకురావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఆవులెన్న సర్పంచ్ రాము, నాయకులు తగ్గుపర్తి రాజన్న, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకురావడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు, తాపీమేస్త్రీలు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం.. పేదలకు వరం

పుట్లూరు, జూలై 8: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలుచేయడం పేదలకు వరంలాంటిదని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక కొనాలంటే వేల రూపాయలు వెచ్చించాల్సి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వంలో నామమాత్రపు రుసుంతో ఇసుకను రవాణా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు: తహసీల్దార్

కణేకల్లు, జూలై 8: మండల వ్యాప్తంగా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ ఇందిరాదేవి హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుకను అందిస్తామని చెప్పిన నేపథ్యంలో మండలంలో అక్రమంగా ఇసుక తరలింపును పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. వినియోగదారులు ఇసుక కావాలనుకుంటే రాయదుర్గం మండలం జుంజురంపల్లి నుంచి ఇసుకను సరైన అనుమతి పత్రాలతో తెచ్చుకోవాలని తెలిపారు.

విభజన హామీల అమలుకు గడువు పొడిగించాలి : సీపీఎం

రాయదుర్గంరూరల్, జూలై 8: కేంద్ర ప్రభుత్వం ఏపీకి ఇచ్చిన విభజన చట్టం హామీలు అమలుకు మరో ఐదేళ్ల గడువు పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక సమైఖ్యాంధ్ర భవనంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం మంజూరు చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలు తీవ్రమైన సమస్యలతో ఉన్నాయని ప్రాంతాల అభివృద్ధికి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు.

అవినీతి బతుకు మీదే..

వైసీపీ నాయకులపై టీడీపీ నాయకుల ఆగ్రహం

గుంతకల్లు, జూలై 8: అవినీతి బతుకులు బతుకుతున్న వైసీపీ నాయకులు తమపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వారు సోమవారం సాయంత్రం టీడీపీ స్థానికకార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, సింగిల్‌విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు పాల మల్లికార్జున మాట్లాడుతూ ఐదేళ్లూ అవినీతికి పాల్పడిన చరిత్ర వైసీపీ నాయకులదని ఆరోపించారు. అయితే టీడీపీ కార్యకర్తలు పింఛనుదారుల వద్ద డబ్బు గుంజుతున్నారని వైఎస్ఆర్ జయంతి సందర్భంగా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. వైసీపీ నాయకుల చిట్టా తాము విప్పితే తలలు ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. అవినీతికి, దౌర్జన్యాలకు పాల్పడవద్దని పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే జయరాం హితవు చెబుతున్నారన్నారు. టీడీపీ నాయకులు గుజరీ మహ్మద్ ఖాజా, తలారి మస్తానప్ప, చికెన్ జగన్, యాస్మిన్, శివన్న, కోడి సీన, చిప్పగిరి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే మాటలు మానుకోండి

వైసీపీ నాయకులపై టీడీపీ గుత్తి ఇన్‌చార్జి మండిపాటు

గుత్తి, జూలై 8: వైసీపీ నాయకులు రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని వైసీపీ గుంతకల్లు నాయకులకు టీడీపీ గుత్తి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ మండిపడ్డాడు. ఆయన సోమవారం సాయంత్రం పట్టణంలో విలేకరులతో మాట్లాడు తూ... దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా గుంతకల్లులో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను రెచ్చగొట్టే విధంగా అవాకులు, చెవాకులు పేలారన్నారు. పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నియోజకవర్గంలో మంచి వాతావరణం కల్పించాలనే సంకల్పంఉన్నా రని, వైసీపీ నాయకు లు ప్రశాంతతకు భంగ పరిచేలా ఉన్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో గుంతకల్లులో భూకబ్జాలను గుర్తించే పనిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. భూకబ్జాలకు పాల్పడిన ఎవరిని వదిలే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్, చికెన్ శ్రీనివాసులు, న్యాయవాది సోమశేఖర్, బీజేపీ నాయకులు ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ వాటర్ పాయింట్‌ను పునఃప్రారంభించండి

కణేకల్లు, జూలై 8: మండలంలోని గ్రామంలో ఉన్న ఫిల్టర్ వాటర్ పాయింట్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎంపీడీఓ గూడెన్నను కోరారు. గతనెల 14వ తేదీన రాజకీయ ఆధిపత్యం కోసం గ్రామ సర్పంచ్‌తో పాటు మరో నలుగురు ఫిల్టర్ వాటర్ పాయింట్ లో పురుగుల మందు కలిపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇప్పటికే ఈ విషయంపై ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వెంటనే ఫిల్టర్ వాటర్ పాయింట్‌ను పునః ప్రారంభించాలన్నారు. అలాగే గ్రామసర్పంచ్ పరారీలో ఉండడంతో గ్రామాభివృద్ధి కుంటుపడిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బాక్సర్‌కు సన్మానం



వందనను సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఉరవకొండ, జూలై 8: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2019-22లో బీఏ కోర్సు చదివిన పూర్వ విద్యార్థిని వందన బాక్సింగ్‌లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. విశాఖపట్టణానికి చెందిన ఎన్ఎస్ఎఫ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 23, 24, 25 తేదీలలో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. దీంతో ఉరవకొండ డిగ్రీ కళాశాల అధ్యాపకులు.. వందనను కళాశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్స్‌పాల్ రామకృష్ణ, ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ జీ అయ్యన్న, పొలిటికల్ అధ్యాపకులు సిరాజ్ అలీఖాన్, హిస్టరి అధ్యాపకులు వెంకట క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.